# ట్రాఫిక్ జామ్




కప్పను మింగిన పాములా ట్రాఫిక్ నెమ్మదిగా సాగిపోతోంది. రకరకాల వాహనాలు, రంగు రంగుల వాహనాలు, టూవీలర్స్, త్రీ వీలర్స్, సిక్స్ వీలర్స్, లైట్ వెహికల్స్, మీడియమ్ వెహికల్స్, హెవీ వెహికల్స్ పరుగులుమాని భారంగా, బరువుగా తమ చక్రాల్ని దొర్లించసాగాయి.

కొద్దిగా ట్రాఫిక్ క్లియర్ అయినట్లుంది. మళ్ళీ ఉరుకులు పరుగులు ప్రారంభమయ్యాయి. సుదర్శనం జాగ్రత్తగా డ్రైవ్ చేస్తున్నాడు. కార్ డ్రయివ్ చేస్తూనే పక్కనే కూర్చున్న శేఖరంతో బాతాఖానీ కొడుతూ వున్నాడు. మరి శేఖరం రాక రాక వచ్చిన మిత్రుడాయె! కబుర్లు మంచి రసకందాయంలో పడ్డాయి. ఉత్సాహంగా కబుర్లు చెబుతున్న సుదర్శనం కాళ్లూ చేతులూ అప్రయత్నంగానే తమపని తాము చేసుకుపోసా గాయి. కారు సాఫీగా ట్రాఫిక్‌లో కదిలిపోతూనే వుంది.

శేఖరం వేసిన జోకుకు వళ్ళంతా కదిలిపోయేలా నవ్వుతున్న సుదర్శనం హఠాత్తుగా తన కారును ఓవర్ టేక్ చేస్తూ భయంకరంగా కర్వ్ తిరిగిన ఆటో దురుసుదనానికి ఉలిక్కిపడ్డాడు. ఒక్క క్షణం ఏమరుపాటుగా వుంటే ఖచ్చితంగా యాక్సిడెంట్ అయ్యేది. మెరుపు వేగంతో అతడి కాళ్ళూ చేతులు స్ప్రింగుల్లా పని చేసి యాక్సిడెంట్‌ను నివారించాయి.

సుదర్శనం కోపం మాత్రం తారాస్థాయినందుకుంది. ఓవర్ టేక్ చేసిన ఆటోవాలాను పీకపిసికి చంపేద్దామన్నంత ఆవేశం కలిగింది. తమాయించుకున్నాడు. యాక్సిలేటర్‌ను నెమ్మదిగా ప్రెస్ చేస్తూ కారును ఆటో ప్రక్కగా పోనివ్వసాగాడు.

''ఏయ్ మిస్టర్! ఏమిటా దూకుడు?''— ఆటోవాలా వైపు చూస్తూ కోపంగా ప్రశ్నించాడు సుదర్శనం.

సమాధానంగా నిర్లక్ష్యంగా తలెగరేసాడు ఆటోవాలా!

''ఏన్నేహోయ్— ఏమిటా స్పీడు— బాంబే వెడుతున్నావా?'' వెటకారంగా అడిగాడు సుదర్శనం.

నోట్లోనించి రక్తమాంసాల్ని వెలికి గ్రక్కిన మారీచునిలా ఆటోవాలా నోట్లో నిరకాలంగా నానుతున్న జరదాపాన్ తాలూకు ఎర్రటి ద్రవాన్ని కాండ్రించి మరీ ఉమ్మేసాడు.

''ఏమంటావ్?'' ఆటోవాలా తనకు వినబడలేదన్నట్లుగా సైగజేస్తూ అడిగాడు సుదర్శనాన్ని.

''ఏంటోయ్ ఆ స్పీడ్— బాంబేగాని వెడుతున్నావా?'' రెట్టించాడు సుదర్శనం.

''అవును. చాలా త్వరగా వెళ్లాలి. మీ అమ్మతో శోభనం గదా! అందుకు'' గారపళ్లు బయట పెట్టి గీరగా నవ్వుతూ అన్నాడు ఆటోవాలా.

సుదర్శనం గుండె భగ్గుమంది. అవమాన భారంతో అతడి గుండెలు కుతకుతలాడాయి. పుండు మీద కారం జల్లినట్లు పక్కనే కూర్చున్న శేఖరం చూసే చూపులు అతగాణ్ణి మరింత రెచ్చగొట్టాయి. యాంత్రికంగా సుదర్శనం చేతిలో తిరుగుతున్న స్టీరింగ్ వీల్‌ను బలంగా చుట్టేసుకున్నాయి. యాక్సిలేటర్ని బలంగా నొక్కాడు సుదర్శనం. మరో అయిదు సెకన్ల తరువాత ఆటోకు అడ్డంగా నిలబడి వుంది కారు!

క్రిందకు దిగిన సుదర్శనం ఒక్క వూపుతో వెళ్ళి ఆటోవాలా షర్ట్ కాలర్ పట్టుకున్నాడు.

''ఏం కూశావ్‌రా రాస్కెల్.''

''బద్మాష్— ఛోడ్ దో''— రెచ్చిపోయాడు ఆటోవాలా.

'ఫట్' మంటూ ఒక్కటి తగిలించాడు సుదర్శనం.

ఆటోవాలా బేర్‌మన్నాడు. కాకిలా కావు కావుమని అరిచాడు. అంతే! చుట్టు పక్కలున్న ఆటోలన్నీ ఆకస్మికంగా ఆగిపోయాయి. ఆటోవాలాలందరూ దెబ్బతిన్న ఆటోవాలా పక్షాన నిలిచారు. ట్రాఫిక్ ఆగిపోయింది.

''ఆటోవాలాల ఐక్యత వర్థిల్లాలి.''

''ఆటోవాలేపై జులుం— నశించాలి.''

''డౌన్ డౌన్— కార్‌వాలా డౌన్

డాన్.''

వినాదాల్తో ఆకాశం పిక్కటిల్లింది. ట్రాఫిక్ సాక్షాత్తు జడ పదార్థంలా స్తంభించిపోయింది.

పరిస్థితి విషమించింది. ఆటోవాళ్ళంతా చేతికందిన ఆయుధాల్ని ధరించి సుదర్శనాన్ని తన్నడానికి రాసాగారు.

ఏ క్షణంలోనైనా పేలడానికి సిద్ధంగా వున్న లైవ్ బాంబులా వున్నది అక్కడి పరిస్థితి.

సుదర్శనం కూడా పెంకిఘటం. పోలీసులొచ్చి అతగాణ్ణి బేషరతుగా క్షమాపణ చెప్పాలని కోరగా ససేమిరా అంటూ అడ్డం తిరిగాడు.

దాంతో పరిస్థితి మరింత విషమించింది.

ఆటోవాలాలు మరింత విజృంభించి వినాదాలు చేయసాగారు.

సబిన్స్పెక్టర్ రాజు ఆలోచనలో పడ్డాడు.

''కరవమంటే కప్పకు కోపం— విడమంటే పాముకు కోపం— ఎలా ఈ సమస్యను పరిష్కరించడం!''

జరిగిన సంఘటన మొత్తాన్ని సింహావలోకనం చేసి తరచి చూశాడు యస్సయ్ రాజు. మెరుపులా ఓ ఆలోచన అతగాడి మనసులో మెరిసింది.

తక్షణం తన ఆలోచనను ఆచరణలోకి మార్చాడు.

ఆటోవాలాల్లో పెద్ద మనుషులుగా కనిపిస్తున్న అర డజను మందిని పిలిచాడు.

''చూడండి బాబులూ! మొత్తం జరిగిన విషయం మీకు తెలుసు. మొదటగా ఓవర్ టేక్ చేసింది ఎవరు?'' ప్రశ్నించాడు యస్సయ్.

''ఆటోవాలా''— ముక్తకంఠంతో చెప్పారంతా.

'' అది తప్పు అంటామా— అవునా— కాదా''— అడిగాడు యస్సయ్.

''అవును— కానీ, అంత పెద్ద తప్పేం గాదు''— అరిచారు ఆటోవాలాలు.

''దానికి నేనంగీకరిస్తాను! కానీ— ఆ కారు తోలుతున్న పెద్ద మనిషి విసుక్కోవడం గూడా తప్పేనంటారా?''— అడిగాడు యస్సయ్.

ఆటోవాలాలు వాదులాడుకోసాగారు. కొంతమంది అవునంటే మరికొందరు కాదన్నారు.

వివరంగా యస్సయ్ చెప్పాడు.

''చూడండి ఆటోబాబులూ— సరే ఆ పెద్ద మనిషిదే తప్పని కాసేపు అనుకుందాం''— తాపీగా అన్నాడు.

## వి.పి.జి. నాయర్
ఐ.పి.యస్.
స్పెషల్ ఐ.జి. ఆఫ్ పోలీస్

## అనంతవరం జనార్ధన్

ఆటోవాలాలంతా ''తప్పుగాదు— తప్పన్నరా''— అంటూ తప్పు బట్టారు.

''మరయితే ఆటోబాబులూ— మీ ఆటోవాలా అన్నమాట మీకు గుర్తుంది కదూ!''

ఆటోవాలాలందరూ ఒకళ్ల ముఖం ఒకళ్లు చూసుకోసాగారు.

''ఏం మాట్లాడరేం— ఏమని తిట్టాడో మీకు గుర్తుంది కదా! అతగాణ్ణి మీ అందరి కోరిక ప్రకారం వదిలేద్దాం! ఆ కారు నడిపిన పెద్ద మనిషిని బుక్ చేద్దాం! అయితే ఈ పని జరగడానికి ముందు మరో చిన్న పని జరగాలి''— కొద్దిగా ఆగాడు యస్సయ్.

ఆటోబాబులు ఊపిరి బిగపట్టి వినసాగారు.

''అదే— ఆటోవాలా తిట్టినట్టు అందరి తల్లుల్ని అతగాడి దగ్గరకు పంపాలి— అలా కోరడం తప్పనుకుంటే అతణ్ణి శిక్షించాలి. ఏ విషయం ఆలోచించి రెండు నిముషాల్లో చెప్పండి''— చెప్పాడు యస్సయ్.

ఆటోబాబులు కాసేపు తలలు దించుకున్నారు.

''మరికాసేపు మల్లగుల్లాలు పడ్డారు.. రెండు నిముషాలు కాకముందే తిట్టిన ఆటోవాలాను చితక బాదసాగారు ఆటోబాబులు.

ఆటోవాలా ఆటోతో సహా మాయమయ్యాడు.

ట్రాఫిక్ రెట్టించిన ఉత్సాహంతో సాగింది. మరికొద్ది క్షణాల్లో క్లియరవుతున్న ట్రాఫిక్ను చిరునవ్వుతో చూస్తూ కనిపించాడు యస్సయ్ రాజు.

